# పరువు

రామభద్రయ్య అర్ధశతాబ్దం వయసు మనిషి. వానాకాలం చదువు. ఉద్యోగం లేదు. ముగ్గురు పిల్లలకు తండ్రి. మూడు తరాలకు సరిపడే సంపాదన సంపాయించాలనుకుంటాడు. తండ్రి సంపాదన నూటికి నూటపదిలెక్కన తిప్పుతాడు. వడ్డీ ఇవ్వకపోతే వడ్డీకి వడ్డీ కట్టి ముక్కు పిండి వసూలు చేస్తాడు. డబ్బులు ఇవ్వనివాడి ఇంట్లోంచి చెంబూ తపేలా, ఏమున్నా అప్పుకు సరిపడకపోయినా లాక్కొస్తాడు. ధనమే ప్రధానమనుకునే పిసినారి మనిషి.

"ఏవండోయ్ కూరగాయలు నిండుకున్నాయి. అన్నీ ఒక్కో కిలో పట్టుకు రండి. ఫ్రిజ్‌లో పారేస్తే, ఓ వారం రోజులు వస్తాయి. ఆనక భోజనానికి కూర్చున్నాక, పచ్చడేనా? అంటే నేనేం చేయలేను" అంది భార్య వరలక్ష్మి. ఆ మాట వినగానే రామభద్రయ్య వీరభద్రుడే అయ్యాడు.

"స్కూటర్ తియ్యగానే కూరగాయలంటావ్! ఇంటి ముందుకు కూరగాయల బండివాడు రావట్లేదా?"

"అయ్యో రావట్లేదండీ, వస్తే తీసుకోనూ".

"నిన్న స్కూటర్ తెచ్చానోలేదో, దీని మీద వెళ్లి మార్కెట్ నుంచి కూరగాయలు తేవాలా?



ఇంకా నయం, కూరగాయలు తీసుకురావడా నికి నాకూడా వస్తాననలేదు" స్కూటరును గుడ్డ తో తుడుస్తూ అన్నాడు.

"మీకు అసలే స్కూటరు నడపడం అల వాటులేదు. డబ్బులు ఇవ్వనివాడి స్కూటరు లాక్కొస్తారు. ఓ రెండ్రోజులు క్రిందా మీద పడి తిప్పింతరువాత వాడుతీసికెళ్తాడు! మీ భారీ శరీరంతో స్కూటరుపై వెళ్లి క్షేమంగా తిరిగివస్తే అదే పదివేలు!! అన్నట్లు బ్రేకులు సరిగా ఉన్నాయోలేదో చూసుకోండి" అన్నది వరలక్ష్మి నవ్వుతూ.

"ఇదంతా నా ఖర్మనే! నిన్నగాక మొన్నపుట్టి, ఈ రోజు పెళ్లి చేసుకుంటున్న వాళ్లకు కూడా అత్తింటివాళ్లు స్కూటర్లు, మోటారు సైకిళ్లూ ఇస్తున్నారు. అప్పుడు నా పెళ్లికి స్కూటరు కాదు కదా, సైకిలు కూడా పెట్టలేదు మీ నాన్నగారు".

"కారు అడిగితే పెట్టేవారేమో!" అంది నవ్వుతూ.

"కారు కాదు కదా, పట్టకారు కూడా ఇవ్వలేదు. మన పెళ్లిలో మీ నాన్న స్కూటర్ పెట్టి ఉంటే ఎంచక్కా నిన్ను వెనక కూర్చో బెట్టుకుని, రయ్ రయ్ మని ప్రాక్టీస్ చేసేవాడిని. ఇప్పుడు నన్ను వెక్కిరించే ఛాన్సు నీకు దక్కేది కాదు".

"అయ్యో సంబడం ఇప్పుడేమయిందనీ... ఓ కుర్రదాన్ని చూసి పెళ్లి చేసుకోండి! వర కట్నం, లాంచనాలు, స్కూటరు, అన్నీ ఇస్తారు" అంది మూతి తిప్పుతూ.

"అదిగో... అదే... ఆ పుల్ల విరుపుడు మా టలే వద్దంటాను. వ్యంగ్యపు మాటలు మీ ఆడాళ్ల సొత్తు".

"ఇంటినిండా అప్పుల వాళ్లదగ్గర నుండి

# సగ్గు రాజయ్య

లాక్కొచ్చిన వస్తువులేనాయే. టి.వి., ఫ్రిజ్, అలమార, కుట్టు మిషను, గ్రైండరు, బిందెలు, తపేలాలు... ఒక్కటేమిటి? ఆఖరికి స్కూటరు కూడా లాక్కొచ్చి వాడుకుంటానంటారు!"

"నేను స్వంతంగా స్కూటరు కొనలేకనా? దారిన పొయ్యే వాళ్లందరూ బొటనవేలు చూపించి తేరగా లిఫ్ట్, లిఫ్ట్ అంటారు. దిగి పోయేటప్పుడు ఓ ఇరవై, ముప్పయి ఇస్తే పెట్రోలుకు కలిసొస్తాయి".

"మీలాంటి వాళ్ల కోసం తమిళనాడులో ఆకులు, అలములతో పెట్రోలు తయారుచేస్తు న్నారట. కారు చవక! లీటరు రూపాయేనట!! ఏజన్సీ తీసుకోండి!!

"అప్పుడన్నారులే... అది ఫేలయి, వాడు ఏ ఆకులూ అలములూ తిని బ్రతుకుతున్నాడో. ఇప్పటివరకూ జాడలేదు. ఇక ఈ స్కూటరుతో ప్రాక్టీసు అయిపోగానే, కొత్త స్కూటరు కొను క్కొని, నిన్ను రయ్‌మని గాలిలో తీసుకుపో తాను!" హుషారుగా నవ్వుతూ అన్నాడు. అది విని వరలక్ష్మి ఊహల్లో స్కూటరు మీద తేలి పోయింది.

రామభద్రయ్య స్కూటర్‌ని ఇంటికెదురుగా నిలబెట్టి స్టార్ట్ చేయడానికి పూనుకున్నాడు. కిక్ కొట్టి, కొట్టి కాలు నొప్పి పుడుతోంది. బండి స్టార్ట్ కావడం లేదు. ఒళ్లంతా చెమటలు పట్టా యి. చివరికి స్టార్ట్ చేయడం తనవల్ల కాదని, చెమటలు తుడ్చుకుంటూ అరుగు మీద చతికిల బడ్డాడు.

"ఏమేవ్! ఓసారిలా వస్తావా?" అరచినట్లు గా అన్నాడు. ఆమేదో స్కూటర్ మెకానిక్ అయి

నట్లు, ఎందుకు స్టార్ట్ కావట్లేదో ఆమెకు తెలిసినట్లు. వరలక్ష్మి బయటికి వచ్చి చూసింది.

"మీరు డబ్బులు పెట్టి కొంటే స్టార్ట్ అయ్యేది. అప్పలసామికి ఆరు వేల రూపాయలిచ్చి రెండు సంవత్సరాల నుంచి అసలు లేదు, వడ్డీ లేదని అతని దగ్గిరనుంచి స్కూటరు లాక్కొస్తిరి" ఈసడింపుగా భర్తవైపు చూస్తూ అంది.

"మెకానిక్ మైసారం మైసయ్య పెయింట్ చేయించి అమ్ముకుంటే, పన్నెండువేల రూపాయలు వస్తాయన్నాడు. దీనికి పెయింట్ చేసి పైన వాలకం మార్చినా, లోపల డొల్లే ఉన్నట్టుంది" అంటూ తిరిగి కిక్ కొట్టడం, ఆక్సిలేటరు ఇవ్వడం చేస్తున్నాడు.


రామభద్రయ్య కిక్ కొడుతూ, చెమటతో తడిసిపోతూండడం చూసి వరలక్ష్మికి తెగజాలేసి, గుండె తరుక్కుపోయింది. అటుగా వెళుతున్న పదిహేనేళ్ల స్కూలు కుర్రాణ్ణి పిలిచి, "ఓరే సత్యం, అంకుల్‌కి స్కూటర్ స్టార్ట్ కావడంలేదు. బాబ్బాబు... నీవు కాస్త స్టార్ట్ చేసిపెట్టరా" అంది బతిమాలినట్లుగా.

"అట్లానా ఆంటీ, స్టార్ట్ కావట్లేదా?" అంటూ స్కూలు బ్యాగు తీసి అరుగు మీద పెట్టి, స్కూటరుని వంచి, పైకి లేపి రెండు కిక్కుల్లో స్టార్ట్‌చేసి, ఆక్సిలేటరు పెంచి, తగ్గించి వదిలేశాడు.

"ఇక వెళ్లండి అంకుల్" అంటూ బండి ఆన్‌లో పెట్టి బ్యాగ్ తీసుకుని వెళ్లిపోయ్యాడు.

బండి స్టార్ట్ అయినందుకు సంతోషించలేదు రామభద్రయ్య. మనస్సు చివుక్కుమంది. లోలోన వరలక్ష్మిని తిట్టుకున్నాడు. మోకాలు నొప్పిపుట్టినా; చెమటలు పట్టినా; స్కూటరు స్టార్ట్ కావడానికి తాను కిక్కులు కొడుతూనే ఉన్నాడు కదా; ఇక ఆ చివరి రెండు కిక్కులూ కొట్టలేకపోయాడా? కుర్రాడి ముందు తన పరువు పోయెకదా! స్టార్ట్ కావడంలేదని వరలక్ష్మితో చెప్పి తప్పు చేశాను. తొందర పడి కుర్రాణ్ణి పిలిచి, స్టార్ట్ చేయించినందుకు వరలక్ష్మిని మనస్సులో తిట్టుకున్నాడు. ఆదా పైకి కనిపించనీయకుండా, వరలక్ష్మికి నవ్వుతూ టాటా చెప్పి స్టార్ట్ అయిన స్కూటరు మీద దర్జాగా ఓ పోజిచ్చి వెళ్లిపోయాడు.

ఆలోచిస్తూ వెళుతున్న రామభద్రయ్యకు రోడ్డు ప్రక్కన షామియానా కనబడింది. అప్పటికే పన్నెండు దాటుతోంది. ఉదయాన్నే ఓ కప్పు టీ నీళ్లు త్రాగాడు. ఆకలితో కడుపు నకనకలాడుతోంది. తాను మార్కెట్‌కి వెళ్లాలి, కూరగాయలుతేవాలి, వరలక్ష్మి వంట చేయాలి, తాను తినాలి. అప్పటి వరకూ ఆగే ఓపిక లేదు. ఇంతమందిలో తనొక్కణ్ణి ఎవరు గుర్తుపడతారు? తాను కూడా సందట్లో సడేమియా! అనుకుంటూ పెళ్లి మెయిన్‌గేటు దగ్గరకెళ్లి స్కూటరు ఆపి, పూలతో డెకరేట్ చేసిన పెళ్లి కుమారుడి పేరు, పెళ్లి కూతురి పేరూ చూసి జ్ఞాపకం పెట్టుకున్నాడు. సరాసరి స్టాండ్‌కి వెళ్లి, స్కూటరు ఆపి, తుండుతో ముఖం గట్టిగా తుడ్చుకుని, దువ్వెనతో తల దువ్వుకున్నాడు. పెళ్లి వేదిక ముందు వేసిన కుర్చీల్లో కూర్చున్నాడు దర్జాగా. అందరూ ఒకరినొకరు చిరునవ్వుతో పలకరించుకుంటూంటే, తనుకూడా అందరికీ పరిచయమున్నట్లు చిరునవ్వు ముఖంతో హలో; హలో అంటూ చెయ్యి లేపి విష్ చేస్తున్నాడు. "లేవండి, లేవండి భోజనాలకు" అంటూ ఓ పెద్దాయన వచ్చి చెప్పాడు. అందుకోసమే ఆవు రావురుమంటూ ఎదురుచూస్తున్న రామభద్రయ్య లేచాడు. భోజనశాలలో చాలారకాల వంటకాలు సిద్దంగా ఉంచారు టేబుళ్ల మీద. మరో ప్రక్కన స్వీట్లు, హాట్లు, ఐస్‌క్రీములు




కూడా ఉన్నాయి. ఆకలి ఎద్దు గడ్డివాము మీద పడ్డట్లు, అన్నిరకాల డిషెస్ కడుపు నిండా తిన్నాడు. స్వీట్లు కూడా తిని, ఐస్‌క్రీమ్ దగ్గిరకెళ్లి అందర్నీ తోసుకుంటూ ఐస్‌క్రీమ్ తెచ్చుకున్నాడు. తింటూ అది అయిపోయిం తరువాత ఇంకోటి తెచ్చుకోవాలనుకున్నాడు. ఇంతలో నలభై అయిదేళ్ల అపరిచితుడు మాటలు కలిపాడు.

"పెళ్లి కొడుకు ఏం పనిచేస్తాడండీ!"

"సత్యం కంప్యూటర్లో ఇంజనీరండీ" తొణకని రామభద్రయ్య సమాధానం!

"అమ్మాయి తండ్రి ఏం పనిచేస్తాడోనండీ".

"బి.హెచ్.ఇ.ఎల్.లో ఆఫీసరండీ!" బాగా తెలిసినట్లుగా చెప్పాడు.

"పాపం చాలా ఖర్చు చేసి వంటలు చేయించారు. నీలాంటి దారినపోయే దానయ్యగాళ్లు తినిపోతే ఇంక పెళ్లివాళ్లకేం మిగులుతుంది?" అసహ్యంగా చూస్తూ అన్నాడు అపరిచితుడు.

తాను తెలిసినట్లు గాలికి వాగితే అపరిచితుడు విని ఊరుకుంటాడనుకున్నాడు. తాను ఎవరికీ ఏమీకానని, కేవలం భోజనానికే పెళ్లికి వచ్చానని తెల్సిపోయిందని, ఆముదం తాగిన వాడిలా మొఖం పెట్టి ఇబ్బంది పడడం చూసి "సిగ్గులేకపోతే సరి, పిలవని పేరంటంగా వచ్చి తేరగా తింటున్నావు. ఒక మంచి భోజనం రేటెంతో తెలుసానీకు?" అపరిచితుడు కోపంగా అన్నాడు రామభద్రయ్య చెవి దగ్గిర మెల్లిగా.

"పెండ్లి పత్రికలోనే బంధుమిత్రసపరివారంగా అంటూ అచ్చు వేసింది మీరు చూళ్లేదా?"

"పోరా, నీవు ఎవరికీ బంధువుకాదు, ఫ్రెండువూ కాదు. బయట బోర్డు చూసి, తేరగా తినిపోదామని వచ్చావు. పని అయిపోయింది కదా, ఇక వెళ్లు, వెళ్లు..." అసహ్యంగా అన్నాడతను.

ఐస్‌క్రీమ్ బౌల్, వుడెన్ స్పూన్ నేలమీద గిరాటేసి, గబగబా బయటికి వచ్చి స్కూటరు

స్టార్ట్ చేసుకుని, రోడ్డున పడ్డాడు పరువుపోయె గదా అని బాధపడుతూ.

సడన్‌గా దిగంబర్ జ్ఞాపకానికి వచ్చాడు. సంవత్సరం దాటిపోయింది డబ్బులు తీసుకుని. వడ్డీ కూడా ఇవ్వడం లేదు. మెయిన్ రోడ్‌లో అయిదు కిలో మీటర్లు పోతేవాడి ఇల్లు వస్తుంది. డబ్బులిస్తే తీసుకురావచ్చు. ఇవ్వకపోతే ఇంట్లోంచి ఏదైనా లాక్కురావచ్చు. అనుకుంటూ రెండు కిలోమీటర్లు వెళ్లేసరికి, రోడ్డు మీద ట్రాఫిక్ పోలీసులు కనిపించారు. ముచ్చెమటలు పోశాయి. నోట్లో తడారిపోయింది. వాళ్ల దగ్గిరకు వెళ్లగానే స్కూటరు నడుపుతున్న రామభద్రయ్య తడబడ్డాడు. అది చూసి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ "ఏయ్ ఆపవయ్యా స్కూటరు" అన్నాడు. కంగారులో ఆక్సిలేటరు ఇస్తూ బ్రేకు మీద కాలుపెట్టి గట్టిగా నొక్కాడు నడపడం అలవాటులేక. స్కూటరేసుకుని క్రింద పడ్డాడు. ఇద్దరు కానిస్టేబుళ్లు పరుగున వచ్చి స్కూటర్‌ని, రామభద్రయ్యనీ లేపారు.

"స్కూటర్ నడపడం రావట్లేదు. ఎక్కడిదయ్యా స్కూటరు" ఇన్‌స్పెక్టరు గద్దించి అడిగాడు.

"న...నా...దే సార్" వణుకుతూ చెప్పాడు.

"లైసెన్స్, ఆర్సీ బుక్ తియ్. పొల్యూషన్ సర్టిఫికెట్ ఉందా?"

"ఇంటి దగ్గిర ఉన్నాయి సార్. మీకేమైనా కావాలంటే ఇస్తాను సార్, నన్ను వదిలేయండి సార్" చేతులు జోడించి ప్రాధేయపడుతూ అడిగాడు.

"మాకేమీ అవసరంలేదు. బండినడిపేటప్పుడు బండికాగితాలు దగ్గిర ఉండాలి. మొదట డ్రైవింగ్ లైసెన్స్ తియ్"

"నా దగ్గిర ఏ కాగితాలూ లేవు సార్, ఎంత కావాలో చెప్పండి..."

> **తెలిసిపోయింది...**
>
> రాము తన ఫ్రెండ్ వాసుతో ఎ.టి.ఎమ్. కి వెళ్లాడు.
>
> వాసు డబ్బు డ్రా చేసిన తరువాత రాము అన్నాడు... 'నువ్వు సీక్రెట్‌గా ఉంచుకొన్న నీ కోడ్ నాకు తెలిసిపోయింది!'
>
> ఎంత? ప్రశ్నించాడు వాసు.
>
> "నాలుగు స్టార్‌లు" టక్కున చెప్పాడు రాము.

"చూడబోతే పెద్దమనిషిలా ఉన్నావ్. ఈ స్కూటర్‌నీదేనా?" నిశిత దృష్టితో చూస్తూ అడిగాడు.

"అదీ... అదీ... నాదే సార్ బండి కాగితాలు లేవుసార్" నసిగాడు. "వేణుగోపాల్; తెఫ్ట్ (దొంగతనం) బండ్ల చిట్టా నీ దగ్గిర ఉంది కదా. ఆ నంబర్లలో ఈ స్కూటర్ నంబర్ ఉందేమో చూడు" కానిస్టేబుల్ వేణుగోపాల్ షర్టు జేబులోంచి నోటుబుక్ తీసి, రామభద్రయ్యా స్కూటర్ నంబర్ చూస్తూ చెక్ చేశాడు.

"ఈ స్కూటర్ సనత్‌నగర్ ఏరియాలో ఆరు నెలల్రకితం తెఫ్ట్ అయ్యిందిసార్. ఇదిగో ఈ నంబరు చూడండి" అంటూ నోట్‌బుక్ ఇచ్చాడు. ఇన్స్పెక్టర్ కూడా నోటుబుక్‌లో ఉన్న నంబర్‌తో స్కూటర్ నంబర్ టాలీ చేసి "ఊ... స్కూటర్‌ని, వీణ్ణి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, వీణ్ణి లాకప్‌లో తొయ్యండి. పెద్ద మనిషిలా కనబడుతున్నావు. దొంగతనం చేయడానికి సిగ్గులేదురా!"

"సార్... సార్ నన్ను పోలీస్ స్టేషన్‌కి తీసికెళ్లకండి. నా పరువుపోతుంది! ఈ స్కూటర్ నాది కాదు సార్. ఒకడికి అప్పు ఇచ్చి, వాడు ఇవ్వకపోతే దీనిని లాక్కొచ్చాను. కావాలంటే




వాణ్ణి చూపిస్తాను. వాణ్ణి తీసుకుపోండి" అంటూ ప్రాధేయపడ్డాడు.

"ఏయ్ మిస్టర్... నీవు ఎవడి పేరు చెబుతావో, లాకప్‌లో వేసి కోటింగ్ ఇచ్చింతరువాత చెబుదువుగాని... ఈ స్కూటర్ ఆరు నెల్ల క్రితం సనత్‌నగర్ ఏరియాలో దొంగతనం చేయబడింది" వేణుగోపాల్ కోపంగా చూస్తూ అన్నాడు.

"సార్... ప్లీజ్ సర్, నా మాట కాస్త వినండి. మీ కాళ్లు పట్టుకుంటాను" అంటూ ఇన్‌స్పెక్టర్ ముందు వంగాడు.

"వేణుగోపాల్, వీణ్ణి స్కూటర్ మీద ఎక్కించుకుని, పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి లాకప్‌లో వేసి రా, హరియప్..."

రామభద్రయ్య కళ్లనీళ్ల పర్యంతమై చేతులు జోడించి, "సార్... ఈ స్కూటర్ నాది కాదు. అప్పలస్వామి ఎక్కడ దొంగతనం చేశాడో... నాకు అప్పు డబ్బులివ్వాలని లాక్కొచ్చాను. మీరు రండి సార్... చూపిస్తాను."

"దొంగలు చెప్పే మాటలు. పోలీసులు పోలీస్ స్టేషన్‌లోనే వింటారు. నడురా దొంగ రాస్కెల్... రా... రా, నా వెనక కూర్చో. ఇప్పటి వరకూ ఎన్ని వెహికిల్స్ దొంగతనం చేశావురా? ఈ రోజు దొరికావన్న మాట!" అంటూ రామభద్రయ్య స్కూటర్‌ని స్టార్ట్ చేశాడు వేణుగోపాల్.

రామభద్రయ్య స్కూటర్ ఎక్కడానికి తటాపటాయిస్తుంటే ఇన్‌స్పెక్టర్ ఒక్క తోపు తోశాడు స్కూటర్ ఎక్కమని.

మారు మాట్లాడకుండా, టకీమని స్కూటర్ మీద ఎక్కి కూర్చున్నాడు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ వేణుగోపాల్ రయ్‌మని పోలీస్ స్టేషన్ వైపు పోనిచ్చాడు.

"ఈ రోజు లేచి ఎవడి మొఖం చూశానో... ఈ రోజంతా పరువుపోయిందని" కళ్లనీళ్ల పర్యంతమయ్యాడు రామభద్రయ్య... స్కూటర్ మీద పోలీస్ స్టేషన్‌కి వెళ్తూ. ●